



Registered No : APTEL/25/A0818

ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక

శుక్రవారం 30-10-2026 | పేజీలు :4 | వెల :2 | సంపుటి :02 | సంచిక :132 | www.edhikadhanijam.com | ఎడిటర్ : బాలరాజు గౌడ్

ఏపీలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ షురూ!



2 లో

రెండు రోజుల పాటు పోలింగ్

ఉదయం 10 నుంచి సాయంత్రం 5 వరకు

ప్రతి వార్డుకు ఆర్ఓ నియామకం

ఏజెంట్ల సమక్షంలో బ్యాలెట్ బాక్సులు

స్ట్రాంగ్ రూంలకు బ్యాలెట్ బాక్సులు

భద్రత నడుమ ఓటింగ్ ప్రక్రియ

కేటీఆర్‌కు సారీ.. బీఆర్ఎస్‌లోకి జంప్?

కేటీఆర్‌కు కొండా సురేఖ క్షమాపణలు

గత వ్యాఖ్యలను ఉపసంహరించుకున్న సురేఖ

మంత్రి పదవి కోల్పోవడంతో అసంతృప్తి

రేవంత్ సర్కార్‌పై బహిరంగ విమర్శలు

బీఆర్ఎస్‌లోకి రీఎంట్రీపై ఊహాగానాలు

కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పే యోచన?

కేటీఆర్‌తో విభేదాలకు తెరపడేనా?

కొండా దంపతులపై గులాబీ బాస్ నిర్ణయమేంటి?



2 లో

న్యూస్ డెస్క్, 29 అక్టోబర్ (ఇది కద నిజం): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌పై గతంలో తాను చేసిన కొన్ని వ్యక్తిగత, నిరాధారమైన వ్యాఖ్యల పట్ల మాజీ మంత్రి కొండా సురేఖ స్పందిస్తూ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ట్విట్టర్ వేదికగా విచారం వ్యక్తం చేశారు. గతంలో రాజకీయ విమర్శల నేపథ్యంలో మాట్లాడిన ఆ వ్యాఖ్యలను పూర్తిగా ఉపసంహరించుకుంటున్నట్లుగా ప్రకటించారు. అప్పటి రాజకీయ పరిస్థితులు, ప్రతిపక్షాలను విమర్శించే క్రమంలోనే ఆ వ్యాఖ్యలు చేశానని కొండా సురేఖ స్పష్టం చేశారు.

అమిత్ షా ఎంట్రీతో బీజేపీ ప్లాన్ మార్పు

ట్యాంక్‌బండ్ నుంచి యాత్ర మార్పు

విపక్షాల ఆరోపణలపై బీజేపీ సమరశంఖం

నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ పరిశీలన

భారీ బహిరంగ సభకు ప్లాన్

నవంబర్ 2న మహాపాదయాత్ర

ఎస్ఐఆర్‌పై విపక్షాల ప్రచారానికి కౌంటర్

2 లో

అర్నబ్ వెనుకే మరో వాయుగుండం!

అక్టోబర్ 30 నాటికి వాయుగుండంగా మారే అవకాశం

అర్నబ్ బాటలోనే కొత్త వాయుగుండం?

గోదావరి జిల్లాలకు భారీ వర్ష సూచన

వరి, కొబ్బరి రైతులకు నష్టం భయం

మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని హెచ్చరిక

తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



2 లో

న్యూస్ డెస్క్, 29 అక్టోబర్ (ఇది కద నిజం): బంగాళాఖాతంలో వరుసగా ఏర్పడుతున్న తుఫానులు, అల్పపీడనాలు కోనసీమ పరిసర ప్రాంత ప్రజలను తీవ్ర భయాందోళనలకు గురిచేస్తున్నాయి. ఇప్పటికే 'అర్నబ్' ప్రభావంతో పలు ప్రాంతాలు తేరుకోకముందే, మరో కొత్త వాయుగుండం తీరం వైపు దూసుకొస్తుండటం ఈ ప్రాంతానికి పెను ముప్పుగా పరిణమించే అవకాశం ఉంది. భారత వాతావరణ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం.. ప్రస్తుతం దక్షిణ అండమాన్ సముద్ర ప్రాంతంలో ఒక అల్పపీడనం వేగంగా బలపడుతోంది. ఇది రాబోయే కొద్ది గంటల్లో తీవ్ర అల్పపీడనంగా మారి, అండమాన్-నికోబార్ దీవుల చుట్టూ కేంద్రీకృతమయ్యే అవకాశం ఉంది. ఈ వ్యవస్థ పశ్చిమ-వాయువ్య దిశగా పయనిస్తూ, అక్టోబర్ 30వ తేదీ నాటికి ఆగ్నేయ బంగాళాఖాతం పరిసరాల్లో వాయుగుండంగా మారనుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

రామ్‌లీలా మార్చ్‌కు రాహుల్ పిలుపు!

నవంబర్ 1న చలో ఢిల్లీ మార్చ్

ప్రజాస్వామ్య పరిరక్షణే లక్ష్యం

ఓట్ చోరీకి వ్యతిరేకంగా పోరాటం

విద్యార్థులకు రాహుల్ విజ్ఞప్తి

భావ ప్రకటనా స్వేచ్ఛపై ఆందోళన

భయపడకుండా ఉద్యమంలో పాల్గొనాలి

2 లో

టీజీపీఎస్సీ నుంచి 102 ఉద్యోగాలు!

102 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్

అక్టోబర్ 30 నుంచి దరఖాస్తులు

నవంబర్ 27 చివరి తేదీ

18-44 ఏళ్ల వారికి అవకాశం

డిగ్రీ అర్హత తప్పనిసరి

టీజీపీఎస్సీ వెబ్‌సైట్‌లో దరఖాస్తులు

2 లో

నీట్ లీక్ కేసులో కీలక మలుపు



2 లో

న్యూస్ డెస్క్, 29 అక్టోబర్ (ఇది కద నిజం): దేశంలో సంచలనం సృష్టించిన నీట్ యూజీ ప్రశ్నాపత్రం లీకేజీ కేసులో విచారణ కీలక దశకు చేరింది. ఈ కేసుకు సంబంధించి మొత్తం 14 మంది నిందితులపై అభియోగాల నమోదుపై ఢిల్లీలోని ప్రత్యేక కోర్టు గురువారం తన ఉత్తర్వులను రిజర్వ్ చేసింది.

అర్నబ్ బీభత్సం
వైతన్న విలవిల!



- ఎటుచూసినా నీట మునిగిన పంట పొలాలే
- కుప్పకూలిన అరటి తోటలు.. విరిగిన కొబ్బరి చెట్లు
- డెల్టా ప్రాంతాల్లో భారీగా పంట నష్టం
- రైతుల కన్నీటి గాథ.. సీఎం ఎదుట ఆవేదన
- బాధితులకు అండగా ఉంటామన్న చంద్రబాబు
- క్షేత్రస్థాయిలోనే అధికారులు.. సీఎం కీలక ఆదేశాలు
- పంట నష్టం అంచనాల్లో పారదర్శకతకు సూచనలు
- ఏపీకి కేంద్రం భరోసా.. సహాయక చర్యలకు హామీ

న్యూస్ డెస్క్, 29 అక్టోబర్ (ఇది కద నిజం): బంగాళాఖాతంలో చెలరేగిన అర్నబ్ తుఫాన్ ఏపీలోని కోస్తా తీరంలో పెను విషాదాన్ని మిగిల్చింది. ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికొచ్చే సమయానికి జలసమాధి కావడంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఈ విపత్కర పరిస్థితిని అంచనా వేయడానికి సీఎం నారా చంద్రబాబు నాయుడు నేరుగా రంగంలోకి దిగారు. గురువారం అమరావతి నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో బయలుదేరిన ఆయన.. కృష్ణా, పశ్చిమ గోదావరి, కోనసీమ జిల్లాల్లో తుఫాను సృష్టించిన బీభత్సాన్ని ఏరియల్ వ్యూ ద్వారా పరిశీలించారు. అమరావతి నుంచి ప్రారంభమై డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం చెయ్యేరు వరకు సీఎం ప్రయాణం సాగింది.

మిగతాది 2 లో..

హైదరాబాద్‌లో రేషన్ మాఫియా!



2 లో

న్యూస్ డెస్క్, 29 అక్టోబర్ (ఇది కద నిజం): ఎల్ నినో ఎఫెక్ట్ పేరుతో ఇప్పటికే భియ్యం ధరలు ఆకాశానికి అంటుతున్న వేళ ఇది చాలదన్నట్లు కొంత మంది వ్యాపారులు భారీగా అక్రమాలకు తెరలేపుతున్నారు. తాజాగా హైదరాబాద్‌లో భారీ రేషన్ బియ్యం స్కామ్ వెలుగు చూసింది. రేషన్ బియ్యానికి పాలిష్ చేసి బయట మార్కెట్లో అమ్మేస్తున్న మాఫియాగుట్టు రట్టైంది. నగరంలోని కర్మన్‌ఘాట్ ప్రాంతంలో పలు రైస్ డిపోలపై సివిల్ సప్లయ్స్, విజిలెన్స్ దాడులు ఏకకాలంలో దాడులు నిర్వహించారు.

ఛత్తీస్‌గఢ్‌లో వింత దృశ్యం!



2 లో

ఛత్తీస్‌గఢ్‌లో ఎర్రగా మారిన ఆకాశం

అర్నబ్ తుఫానుతో వాతావరణంలో మార్పులు

ఎర్రటి ఆకాశానికి అసలు కారణమేంటి?

సూర్యకాంతి విక్షేపణమే ప్రధాన కారణం

దుమ్ము, పొగతో పెరిగే ఎరుపు తీవ్రత

ఓబీసీ కులగణనపై కవిత పోరుబాట!

కవిత సంచలన వ్యాఖ్యలు

ఓబీసీలకు గుర్తింపు కీలకం

కులగణన లేకుంటే హక్కులకు నష్టం

గణాంకాలపై కవిత అందోళన

దేశవ్యాప్త ఉద్యమానికి పిలుపు

ఇది ఆరంభం మాత్రమే: కవిత



2 లో

న్యూస్ డెస్క్, 29 అక్టోబర్ (ఇది కద నిజం): జనగణన-2027లో ఓబీసీల కోసం ప్రత్యేకంగా కులాల జాబితాతో కూడిన డ్రాప్‌డౌన్ ఆప్షన్‌ను ముందుగానే చేర్చాలంటూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారించేందుకు నిరాకరించడంపై తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పందించారు. ఇది విధానపరమైన నిర్ణయమని కోర్టు పేర్కొన్నప్పటికీ.. ఏ వర్గాన్ని లెక్కల్లోకి తీసుకుంటారో ఆ వర్గానికే గుర్తింపు లభిస్తుందని ఆమె అభిప్రాయపడ్డారు.

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
శుక్రవారం 30-10-2026

నీట్ లీక్ కేసులో కీలక మలుపు

మొదటి పేజీ తరువాయి

ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి అజయ్ గుప్తా ఈ కేసుకు సంబంధించిన ఉత్తర్వులను నవంబర్ 18న వెలువరించనున్నట్లుగా ప్రకటించారు. పబ్లిక్ పరీక్షల్లో పేపర్ లీక్‌లు, అక్రమాలపై విచారణ జరిపేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టులో ఈ విచారణ కొనసాగుతోంది.

సిబిఐ ఫస్ట్ ఛార్జ్‌షీట్ దాఖలు..

నీట్ పేపర్ లీక్ కుంభకోణానికి సంబంధించి గతంలో సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సిబిఐ) 13 మంది నిందితులపై తొలి ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది. ఆ తర్వాత మహారాష్ట్రలోని నాందేడ్‌కు చెందిన శేషాద్ బజ్రంగ్ సూర్యవంశీ అలియాస్ రాజ్ సూర్యవంశీని సెప్టెంబర్ 2న అరెస్టు చేసి, ఆయనపై సప్లిమెంటరీ ఛార్జ్‌షీట్ దాఖలు చేయడంతో నిందితుల సంఖ్య 14కి చేరింది. కాగా, వైద్య విద్య కోర్సుల ప్రవేశాల కోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించే నీట్ యూజీ పరీక్షల్లో పేపర్ లీక్ ఆరోపణలు రావడంతో తీవ్ర దుమారం చెలరేగింది. దీంతో మే 12న నిర్వహించిన పరీక్షను రద్దు చేస్తున్నట్లుగా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ప్రకటించింది. ఆ తర్వాత జూన్ 21న మళ్లీ తిరిగి రీ ఎగ్జామ్ నిర్వహించిన సంగతి తెలిసిందే.

హైదరాబాద్‌లో రేషన్ మాఫియా!

మొదటి పేజీ తరువాయి

కర్మన్‌ఘాట్‌లోని పలు రైస్ డిపోల్లో బియ్యం సంచులపై ముద్రించిన తూకానికి, వాస్తవంగా ఉన్న బియ్యం పరిమాణానికి తేడా ఉంటోందనే ఫిర్యాదులతో రంగంలోకి దిగగా ఈ సోదాల్లో షాకింగ్ విషయాలు వెలుగు చూశాయి.

బ్రాండెడ్ కంపెనీల పేర్లతో విక్రయం:

పేదలకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకే కొనుగోలు చేస్తున్న వ్యాపారాలు వాటిని పాలిష్ చేసి బ్రాండెడ్ కంపెనీ బియ్యం పేరుతో బహిరంగ మార్కెట్లో అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు ఈ తనిఖీల్లో వెల్లడైంది. ప్రస్తుతం సన్న బియ్యం ధరలు భారీగా పెరుగుతున్నాయి. ఈ పరిస్థితిని తమ లాభాలకు అనుకూలంగా మలుచుకుంటున్న వ్యాపారులు రేషన్ బియ్యాన్ని ప్రాసెస్ చేసి మార్కెట్లో కిలో రూ.80 నుంచి రూ.100 వరకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది.

అధికారుల రాకతో దుకాణాలు మూసివేత

సివిల్ సప్లైస్, విజిలెన్స్ అధికారుల తనిఖీలతో కర్మన్‌ఘాట్ ప్రాంతంలో ఒక్కసారిగా కలకలం రేగింది. అధికారులు వస్తున్నారనే సమాచారంతో పలువురు వ్యాపారులు తమ దుకాణాలను మూసివేసినట్లు సమాచారం. తనిఖీల్లో భాగంగా కొన్ని రైస్ డిపోలు ట్రేడ్ లైసెన్స్ లేకుండానే నిర్వహిస్తున్నట్లు అధికారులు గుర్తించినట్లు తెలుస్తోంది. సంబంధిత నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకునే అవకాశముంది. పేదలకు అందాల్సిన రేషన్ బియ్యం అక్రమంగా బహిరంగ మార్కెట్‌కు చేరుతోందా? ఈ వ్యవహారం వెనుక ఎవరున్నారు? బియ్యాన్ని ఎక్కడి నుంచి సేకరిస్తున్నారు? ఏయే ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు? అనే అంశాలపై అధికారులు ఆరా తీస్తున్నారు. సేకరించిన శాంపిల్స్ పరీక్షల అనంతరం బియ్యం నాణ్యత, విక్రయాల్లో అక్రమాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

అమిత్ షా ఎంట్రీతో బీజేపీ ప్లాన్ మార్పు



న్యూస్ డెస్క్, 29 అక్టోబర్ (ఇది కద నిజం): హైదరాబాద్‌లో నవంబర్ 2వ తేదీన నిర్వహించ తలపెట్టిన 'మహాపాదయాత్ర' ప్రాంతాన్ని మార్చే దిశగా బీజేపీ తీవ్రంగా ఆలోచిస్తోంది. తొలుత ట్యాంక్‌బండ్ ప్రాంగణంలో ఈ పాదయాత్ర చేపట్టాలని భావించినప్పటికీ, భద్రత, ఇతర పరిపాలనాపరమైన అంశాలను దృష్టిలో ఉంచుకుని రూట్‌ను మరోచోటుకు మార్చాలని పార్టీ నేతలు ప్లాన్ చేస్తున్నారు. ఈ మహాపాదయాత్రకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ముఖ్య అతిథిగా హాజరవుతున్న నేపథ్యంలో బీజేపీ అధిష్టానం ఈ నిర్ణయం వైపు మొగ్గు చూపుతోంది. అమిత్ షా పాల్గొంటుండటంతో పాటు భారీ స్థాయిలో జనసమీకరణ జరిగే అవకాశం ఉన్నందున, పాదయాత్ర అనంతరం భారీ బహిరంగ సభను నిర్వహించాలని పార్టీ యోచిస్తోంది. ఇందులో భాగంగా బహిరంగ సభ నిర్వహణకు అనువైన ప్రాంతంగా నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌ను బీజేపీ కీలక నేతలు పరిశీలించారు.

ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై ప్రతిపక్ష 'ఇండియా' కూటమి చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ఎండగట్టడమే లక్ష్యంగా బీజేపీ ఈ పాదయాత్రకు శ్రీకారం చుట్టింది. కాంగ్రెస్, విపక్షాల ఆరోపణలను తిప్పికొడుతూ ప్రజల్లోకి వాస్తవాలను తీసుకెళ్లేందుకు ఈ యాత్ర ద్వారా సమరశంఖం పూరించాలని బీజేపీ నిర్ణయించింది.

కేటీఆర్‌కు సారీ.. బీఆర్ఎస్‌లోకి జంప్?

మొదటి పేజీ తరువాయి

అంతేకానీ కేటీఆర్‌ను కానీ, ఆయన కుటుంబ సభ్యులను గానీ ఉద్దేశపూర్వకంగా బాధపెట్టే ఉద్దేశం లేదా వారి ప్రతిష్టకు భంగం కలిగించే దురుద్దేశం తనకు ఎంతమాత్రం లేదని పేర్కొన్నారు.



పోయిన మంత్రి పదవి.. రేవంత్ సర్కార్‌పై అసంతృప్తి

అయితే, ఇటీవలే కాంగ్రెస్ అధిష్ఠానం, సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించిన విషయం తెలిసిందే. తగిన కారణం చూపకుండా, కనీసం వివరణ ఇచ్చే అవకాశం కూడా ఇవ్వకుండా తనను మంత్రి పదవి నుంచి తప్పించారని, బీసీ మహిళ కావడం వల్లే తనపై ఈ విధమైన చర్యలు తీసుకున్నారా అంటూ ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పరిణామాల అనంతరం కాంగ్రెస్ నాయకత్వంపై కొండా సురేఖ తీవ్ర అసంతృప్తితో ఉన్నారనే వార్తలు పొలిటికల్ సర్కిల్స్‌లో హాట్ టాపిక్‌గా మారాయి.

బీఆర్ఎస్‌లోకి రీ ఎంట్రీ..!

మంత్రి పదవి పోవడంజ.. మరోవైపు కాంగ్రెస్ ప్రభుత్వంపై బహిరంగంగానే అసంతృప్తి వెళ్లగక్కడంతో పాటు, సడన్‌గా కేటీఆర్‌పై చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటూ పోస్ట్ చేయడం తెలంగాణ రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు దారితీస్తోంది. కొండా సురేఖ, మురళి దంపతులు త్వరలోనే కాంగ్రెస్‌కు గుడ్ బై చెప్పి మళ్లీ గులాబీ దళంలోకి చేరుతారనే ఊహాగానాలు జోరందుకున్నాయి. కేటీఆర్‌తో ఉన్న చట్టపరమైన, రాజకీయపరమైన విభేదాలను సర్దుబాటు చేసుకునేందుకే ఈ వివరణ ఇచ్చారని, గులాబీ గూటికి చేరేందుకు బాటలు సుగమం చేసుకుంటున్నారని పొలిటికల్ అనలిస్టులు భావిస్తున్నారు. అయితే, కొండా దంపతుల రీఎంట్రీపై గులాబీ బాస్ ఎలా రియాక్ట్ అవుతారనేది ఆసక్తికరంగా మారింది.

ఓబీసీ కులగణనపై కవిత పోరుబాట!

మొదటి పేజీ తరువాయి

ఈ మేరకు ఆమె సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ.. ఓబీసీ రిజర్వేషన్లను సమర్థించుకోవడానికి న్యాయస్థానాలు అనుభవపూర్వక గణాంకాలను కోరుతున్నాయని, అయితే ఓబీసీ కులాల కచ్చితమైన గణనను మాత్రం కేవలం పరిపాలనా అంశంగా పరిగణించడం విరుద్ధంగా ఉందని పేర్కొన్నారు. సరైన గణాంకాలు లేకపోతే ఓబీసీల హక్కులకు పునాది బలహీనపడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఇది ఆరంభం మాత్రమే: రాజ్యాంగం కల్పించిన సామాజిక న్యాయం హామీని సాధించేందుకు ఈ పోరాటాన్ని అన్ని వేదికలపై కొనసాగిస్తామని కవిత స్పష్టం చేశారు. న్యాయవ్యవస్థతో పాటు రాజకీయ కార్యాచరణ, దేశవ్యాప్తంగా క్షేత్రస్థాయి ఉద్యమాల ద్వారా ఓబీసీల హక్కుల కోసం పోరాడతామని తెలిపారు. సుప్రీంకోర్టు నిర్ణయంతో పోరాటం ముగిసిపోలేదని, ఇది మరింత పెద్ద ఉద్యమానికి ఆరంభమని ఆమె పేర్కొన్నారు.

ఏపీలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ షురూ!

న్యూస్ డెస్క్, 29 అక్టోబర్ (ఇది కద నిజం): ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక ఎన్నికలకు సంబంధించి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రారంభమైంది. రెండు రోజుల పాటు ఈ ఓటింగ్ ప్రక్రియ కొనసాగనుంది. ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు, దూర ప్రాంతాల్లో ఉండే అర్హులైన ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని అధికారులు కల్పించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఓటింగ్ నిర్వహించనున్నారు.

ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందితో పాటు దూర ప్రాంతాల్లో ఉన్న అర్హులైన ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఓటింగ్ ప్రక్రియ సజావుగా జరిగేలా అవసరమైన సిబ్బందిని నియమించారు. అభ్యర్థుల ఏజెంట్ల సమక్షంలో బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేశారు. పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ నిర్వహణ కోసం ప్రతి వార్డుకు రిటర్నింగ్ ఆఫీసర్ (ఆర్ఓ)తో పాటు ఇద్దరు సహాయకులను నియమించారు. ఓటింగ్ ప్రక్రియను నిబంధనల ప్రకారం నిర్వహించడంతో పాటు పారదర్శకతను పాటించేలా ఏర్పాట్లు చేశారు.

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ పూర్తయిన అనంతరం బ్యాలెట్ బాక్సులను భారీ భద్రత నడుమ స్ట్రాంగ్ రూంలకు అధికారులు తరలించనున్నారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా బ్యాలెట్ బాక్సుల భద్రతకు అధికారులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. రెండు రోజుల పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసేందుకు ఎన్నికల సిబ్బంది చర్యలు చేపట్టారు.

ఢిల్లీ మార్చ్‌కు రాహుల్ పిలుపు!



న్యూస్ డెస్క్, 29 అక్టోబర్ (ఇది కద నిజం): దేశంలో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవడానికి నవంబర్ 1న న్యూఢిల్లీలోని రామ్‌లీలా మైదాన్ వేదికగా చేపడుతున్న చలో ఢిల్లీ రామ్‌లీలా మార్చ్ లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ట్విట్టర్ వేదికగా ఓ వీడియోను విడుదల చేశారు.

ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. ఈ మార్చ్ ఏ ఒక్క రాజకీయ పార్టీకి సంబంధించినది కాదని అన్నారు. ఇది భారతదేశ ఆత్మను, ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి, ఓట్ చోరీని అడ్డుకోవడానికి జరుగుతున్న పోరాటమని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్ షా, ఎన్నికల కమిషన్ తీరుపై అసంతృప్తితో ఉన్నవారంతా, ప్రజాస్వామ్య ప్రేమికులంతా ఈ నిరసనలో పాల్గొనాలని కోరారు.

విద్యార్థి సంఘాలకు కీలక విజ్ఞప్తి..

రాజకీయ అనుబంధాలతో సంబంధం లేకుండా విద్యార్థులంతా ఢిల్లీ రామ్‌లీలా మార్చ్‌కు రావాలని రాహుల్ విజ్ఞప్తి చేశారు. 'మీ భావ ప్రకటనా స్వేచ్ఛ, ఆలోచనలు, మీ జీవన విధానం దాడికి గురవుతున్నాయని మీరు భావిస్తే, వెంటనే వచ్చి మాతో కలవండి. పోలీసులు, లాఠీలకు భయపడాల్సిన అవసరం లేదు. బీజేపీ ప్రభుత్వం ఎటువంటి వికృత చర్యలకు దిగే ధైర్యం చేయలేదు. భయపడకండి, మనమందరం కలసి నడుద్దాం' అని ధైర్యం చెప్పారు. నవంబర్ 1న రామ్‌లీలా మైదాన్‌లో జరిగే ఈ భారీ మార్చ్‌లో దేశ నలుమూలల నుంచి వేలాది మంది పాల్గొని ఈ ఉద్యమాన్ని జయప్రదం చేయాలని రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు.

ఛత్తీస్‌గఢ్‌లో వింత దృశ్యం!

న్యూస్ డెస్క్, 29 అక్టోబర్ (ఇది కద నిజం): ఛత్తీస్‌గఢ్‌లో ఆకాశం ఒక్కసారిగా ఎర్రగా, రక్తం రంగులోకి మారిపోవడం స్థానికులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. అర్నబ్ తుఫాను కారణంగా ఈ ప్రాంతంలో వీస్తున్న ఈదురు గాలులు, అస్థిరమైన వాతావరణం నడుమ ఈ వింత దృశ్యం ఆవిష్కృతమైంది. ఆకాశం ఎరుపు రంగులోకి మారిన వీడియోలు, ఫోటోలు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ కావడంతో, దీని వెనుక ఉన్న కారణాలపై తీవ్ర స్థాయిలో చర్చ నడుస్తోంది. మధ్య భారతంలో అర్నబ్ తుఫాను శేషాలు (రెమ్నెంట్స్) ముందుకు కదలడంతో భారీ వర్షాలు, బలమైన గాలులు, ఉరుములతో కూడిన తుఫాను హెచ్చరికలు జారీ అయ్యాయి. సరిగ్గా ఇదే సమయంలో ఈ ఎర్రటి ఆకాశం కనిపిచేసరికి అందరి దృష్టి దీనిపై పడింది. అయితే, ఈ ఎరుపు రంగు ఆకాశానికి తుఫాను వంటి వాతావరణ పరిస్థితులు కొంతవరకు దోహదపడి ఉండవచ్చు. కానీ అర్నబ్ తుఫానుకు, ఈ రంగు మార్పునకు ప్రత్యక్ష సంబంధం ఉందనడానికి ఇప్పటివరకు స్పష్టమైన ఆధారాలు లేవని నిపుణులు చెబుతున్నారు.

సాధారణంగా ఆకాశం ఎరుపు రంగులోకి మారడానికి సూర్యకాంతి వాతావరణంలోని అణువులు, కణాల ద్వారా చెల్లాచెదురు (స్కాటరింగ్) అవ్వడమే ముఖ్య కారణమట. ముఖ్యంగా సూర్యోదయం, సూర్యాస్తమయ సమయాల్లో సూర్యకాంతి వాతావరణంలో ఎక్కువ దూరం ప్రయాణించాల్సి వస్తుంది. ఆ సమయంలో తక్కువ తరంగదైర్ఘ్యం కలిగిన నీలం రంగు కాంతి ఎక్కువగా చెల్లాచెదురై పోతుంది. ఇక, ఎక్కువ తరంగదైర్ఘ్యం ఉన్న ఎరుపు, నారింజ రంగులు మాత్రమే మన కంటికి స్పష్టంగా కనిపిస్తాయి. దీనిని శాస్త్రీయంగా రేలీ స్కాటరింగ్ అంటారు. దీనికి తోడు వాతావరణంలో దుమ్ము, పొగ, నీటి బిందువులు వంటి పెద్ద కణాలు ఉన్నప్పుడు ఎరుపు రంగు తీవ్రత ఇంకా పెరుగుతుంది. తుఫాను మేఘాలు, దుమ్ము, వెలుతురు-నీడల కలయిక వల్ల కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో ఆకాశం ఇలా అత్యంత భయానకంగా, ఎర్రగా కనిపిస్తుంది. కానీ.. ఈ అంశంపై శాస్త్రవేత్తలు ఇంకా పరిశోధనలు జరుపుతూనే ఉన్నారు. ఈ తరుణంలో స్థానికులు అధికారులు జారీ చేసే హెచ్చరికలను పాటిస్తూ జాగ్రత్తగా ఉండాలి.

అర్నబ్ వెనుకే మరో వాయుగుండం!



న్యూస్ డెస్క్, 29 అక్టోబర్ (ఇది కద నిజం): బంగాళాఖాతంలో వరుసగా ఏర్పడుతున్న తుఫానులు, అల్పపీడనాలు కోనసీమ పరిసర ప్రాంత ప్రజలను తీవ్ర భయాందోళనలకు గురిచేస్తున్నాయి. ఇప్పటికే 'అర్నబ్' ప్రభావంతో పలు ప్రాంతాలు తేరుకోకముందే, మరో కొత్త వాయుగుండం తీరం వైపు దూసుకొస్తుండటం ఈ ప్రాంతానికి పెను ముప్పుగా పరిణమించే అవకాశం ఉంది. భారత వాతావరణ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం.. ప్రస్తుతం దక్షిణ అండమాన్ సముద్ర ప్రాంతంలో ఒక అల్పపీడనం వేగంగా బలపడుతోంది. ఇది రాబోయే కొద్ది గంటల్లో తీవ్ర అల్పపీడనంగా మారి, అండమాన్-నికోబార్ దీవుల చుట్టూ కేంద్రీకృతమయ్యే అవకాశం ఉంది. ఈ వ్యవస్థ పశ్చిమ-వాయువ్య దిశగా పయనిస్తూ, అక్టోబర్ 30వ తేదీ నాటికి ఆగ్నేయ బంగాళాఖాతం పరిసరాల్లో వాయుగుండంగా మారనుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

ప్రస్తుతం తీవ్ర కలకలం సృష్టించిన 'అర్నబ్' తుఫాను ఏ మార్గంలో అయితే ప్రయాణించి తీరాన్ని దాటిందో, సరిగ్గా అదే బాటలో ఈ కొత్త వాయుగుండం కూడా ప్రయాణించే అవకాశం ఉందని హెచ్చరికలు జారీ అయ్యాయి. ఒకవేళ ఇదే నిజమైతే, ఇప్పటికే వరదలు, ఈదురుగాలుల దెబ్బకు కోలుకోలేని స్థితిలో ఉన్న గోదావరి జిల్లాలకు, ముఖ్యంగా తీరప్రాంతమైన కోనసీమకు భారీ స్థాయిలో నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది.

ఈ తీవ్ర వాయుగుండం ప్రభావంతో కోనసీమ వ్యాప్తంగా ఈదురుగాలులతో కూడిన భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యే ప్రమాదం ఉండటంతో పాటు పంట చేతికొచ్చే సమయంలో వరి, కొబ్బరి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం కనిపిస్తోంది. సముద్రం తీవ్రంగా అల్లకల్లోలంగా మారనున్నందున మత్స్యకారులు ఎవరూ వేటకు వెళ్లవద్దని అధికార యంత్రాంగం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. తీరప్రాంత ప్రజలు, రైతులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, తుఫాను సహాయక బృందాల హెచ్చరికలను పాటించాలని విపత్తు నిర్వహణ శాఖ కోరింది.

టీజీపీఎస్సీ నుంచి 102 ఉద్యోగాలు!



న్యూస్ డెస్క్, 29 అక్టోబర్ (ఇది కద నిజం): తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులకు కీలక అప్డేట్ వచ్చింది. మండల ప్లానింగ్, స్టాటిస్టికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. మొత్తం 102 ఖాళీలను భర్తీ చేయనుండగా, అర్హులైన అభ్యర్థులు అక్టోబర్ 30 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తులకు నవంబర్ 27 చివరి తేదీగా ప్రకటించారు.

ఏ పోస్టులు? ఎన్ని ఖాళీలు?

టీజీపీఎస్సీ నోటిఫికేషన్ నంబర్ 07/GES/2026 ప్రకారం, ఆర్థిక, గణాంకాల డైరెక్టరేట్ పరిధిలో మండల ప్లానింగ్ అండ్ స్టాటిస్టికల్ ఆఫీసర్స్ / అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్స్ పోస్టులను భర్తీ చేయనున్నారు. ఈ పోస్టులు జోనల్ కేడర్ పరిధిలోకి వస్తాయి. మొత్తం 102 ఖాళీలు ఉన్నాయి.

వయోపరిమితి ఎంత?

2026 జూలై 1 నాటికి అభ్యర్థుల వయస్సు కనీసం 18 ఏళ్లు, గరిష్ఠంగా 44 ఏళ్లు ఉండాలి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వర్తించే వయోపరిమితి సడలింపుల వివరాలను పూర్తి నోటిఫికేషన్‌లో పరిశీలించాలి.

విద్యార్హతలు ఇవే

ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు సంబంధిత విభాగాల్లో బ్యాచిలర్ డిగ్రీ ఉండాలి. ప్రధానంగా స్టాటిస్టిక్స్ ఒక ముఖ్యమైన సబ్జెక్టుగా చదివి ఉండాలి. లేదా మ్యాథమెటిక్స్, ఎకనామిక్స్, కామర్స్, కంప్యూటర్ సైన్స్‌లో డిగ్రీతో పాటు డిగ్రీ చదివిన ఒకటి లేదా రెండు సంవత్సరాల్లో లేదా మూడు సంవత్సరాల్లో స్టాటిస్టిక్స్ ఒక పేపర్‌గా చదివి ఉండాలి. అభ్యర్థులు తమ డిగ్రీ సబ్జెక్టులు నోటిఫికేషన్‌లో పేర్కొన్న అర్హతలకు సరిపోతాయో లేదో ముందుగా నిర్ధారించుకోవాలి.

జీతం ఎంత వస్తుంది?

ఎంపికైన అభ్యర్థులకు నెలవారీ పే స్కేల్ రూ.36,750 నుంచి రూ.1,06,990 వరకు ఉంటుంది. పోస్టుకు సంబంధించిన పూర్తి వివరాలు, ఎంపిక విధానం, పరీక్షా విధానం, దరఖాస్తు నిబంధనలను అధికారిక నోటిఫికేషన్‌లో తెలుసుకోవచ్చు.

దరఖాస్తు ఎక్కడ చేయాలి?

అర్హులైన అభ్యర్థులు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ అధికారిక వెబ్‌సైట్ https://www.tgpsc.gov.in ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు ప్రక్రియ అక్టోబర్ 30, 2026న ప్రారంభమై నవంబర్ 27, 2026న ముగుస్తుంది. చివరి తేదీ వరకు వేచి ఉండకుండా, అర్హతలు పరిశీలించి ముందుగానే దరఖాస్తు చేసుకోవడం మంచిది.

అర్నబ్ బీభత్సం.. రైతన్న విలవిల!

మొదటి పేజీ తరువాయి



ఎటుచూసినా నీట మునిగిన పంటలే...

నిమ్మకూరు, పామర్రు, బంటుమిల్లి, నరసాపురం, పాలకొల్లు, అమలాపురం మీదుగా సీఎం హెలికాప్టర్ వెళ్తున్న సమయంలో కనుచూపు మేరలో ఎటుచూసినా నీట మునిగిన పొలాలే కనిపించాయి. ముఖ్యంగా డెల్టా ప్రాంతాల్లోని వరి చేలు పూర్తిగా బురదమయమయ్యాయి. ఈదురు గాలుల ధాటికి నేలకొరిగిన అరటి తోటలు, నిలువునా విరిగిపడిన కొబ్బరి చెట్లు, వరద నీటితో ఏకమైపోయిన ఆక్వా చెరువులను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పరిశీలించారు.

బాధిత రైతులతో సీఎం ముఖాముఖి...

నష్టాన్ని అంచనా వేసిన అనంతరం చంద్రబాబునాయుడు బాధిత రైతులతో కూడా మాట్లాడారు. కోతకు వచ్చే దశలో తుఫాన్ వల్ల బాగా నష్టపోయామని, దిగుబడి పడిపోతుందని సీఎం ఎదుట రైతులు వాపోయారు. దీంతో ప్రభుత్వం మీకు అండగా ఉంటుందని, ఎవరూ అధైర్యపడొద్దని ముఖ్యమంత్రి వారికి భరోసా ఇచ్చారు. అలాగే అధికారులు చేపడుతున్న సహాయక చర్యలపై ఆరా తీశారు. అదేవిధంగా అధికార యంత్రాంగం అంతా క్షేత్రస్థాయిలోనే ఉండి తక్షణ సహాయక చర్యలు ముమ్మరం చేయాలని, పంట నష్టం అంచనాలను పారదర్శకంగా నమోదు చేయాలని ఆదేశాలిచ్చారు.

తుఫాన్ నష్టం.. కేంద్రం సాయం..

తుఫాన్ కారణంగా నష్టపోయిన ఏపీకి కేంద్ర ప్రభుత్వం సాయం చేయనుంది. ఇప్పటికే కేంద్ర మంత్రి అమిత్ షా ఏపీతో పాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్, పాండిచ్చేరి సీఎంలతో మాట్లాడారు. తుఫాన్ నష్టాలపై సమీక్ష జరిపారు. నష్ట తీవ్రతను అంచనా వేయడానికి కేంద్ర బలగాలను పంపిస్తామని, కేంద్రం నుంచి సహాయ సహకారాలను అందిస్తామని హామీ ఇచ్చారు.

ఇథనాల్‌పై సుప్రీం ప్రశ్న!



న్యూస్ డెస్క్, 29 అక్టోబర్ (ఇది కద నిజం): 100 శాతం ఇథనాల్‌తో నడిచే వాహనాలకు అనుమతి ఇస్తే.. దానికి తగిన ఇథనాల్ సరఫరాను ఎలా సాధ్యం చేస్తారని సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. అక్టోబర్ 26న రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖ 'సెంట్రల్ మోటార్ వెహికల్స్ రూల్స్ 1989'కి సవరణలు చేస్తూ, ఈ100 ఇంధనంతో నడిచే 'ఫ్లెక్స్-ఫ్యూయల్' వాహనాలకు అనుమతినిస్తూ నోటిఫికేషన్ విడుదల చేసింది. అయితే.. మరోవైపు పెట్రోల్‌లో ఇథనాల్ శాతాన్ని ప్రస్తుతం ఉన్న 20 శాతానికి మించి పెంచే తక్షణ ప్రణాళికలేవీ లేవని పెట్రోలియం మంత్రి హర్దీప్ సింగ్ పురీ ఇటీవల ప్రకటించారు. ఈ నేపథ్యంలో.. వార్తాపత్రిక కథనాలను ప్రస్తావిస్తూ జస్టిస్ ఎం.ఎం. సుందరేష్, జస్టిస్ ప్రసన్న బి. వరాలేలతో కూడిన ధర్మాసనం గురువారం కీలక వ్యాఖ్యలు చేసింది.

న్యాయస్థానం వేసిన ప్రశ్నకు కేంద్ర ప్రభుత్వం తరఫున అటార్నీ జనరల్ ఆర్. వెంకటరమణి సమాధానమిస్తూ.. 100 శాతం ఇథనాల్ ఇంధన సరఫరాను అందుబాటులోకి తీసుకురావాలంటే భారీ స్థాయిలో ఉత్పత్తి వ్యవస్థల్లో పునర్వ్యవస్థీకరణ అవసరమవుతుందని తెలిపారు. ఇథనాల్ ప్రాజెక్టుల వల్ల పర్యావరణ ప్రయోజనాలతో పాటు.. దేశంలో పల్లెల్లో ఉన్న సామాన్య రైతాంగాన్ని ఆర్థికంగా సాధికారులుగా మార్చాల్సిన అవసరం ఎంతైనా ఉందని కోర్టు అభిప్రాయపడింది. రైతులకు సాధికారత కల్పించడం అనేది ఎవరూ పెద్దగా ప్రస్తావించని అత్యంత ముఖ్యమైన విషయమని, ఈ అంశాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఇథనాల్ ప్రోత్సాహం వల్ల రైతులకు ఏదో ఒక రూపంలో మేలు జరుగుతుందని, ప్రభుత్వం రూపొందించిన విధానాల్లో రైతు ప్రయోజనాలను కూడా పొందుపరిచారని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు కోర్టుకు తెలిపారు. ఇథనాల్ సరఫరా సంవత్సరం 2025-26 కేటాయింపులకు సంబంధించి దాఖలైన పిటిషన్లపై ధర్మాసనం విచారణ చేపట్టింది. కర్ణాటక హైకోర్టు ఇథనాల్ కేటాయింపులను పెంచాలని ఇచ్చిన ఉత్తర్వులపై దాఖలైన అపీలును విచారిస్తూ కోర్టు గతంలో స్టేటస్ కో విధించింది. ఇథనాల్ ఆధారిత పరిశ్రమలకు సంబంధించి దాఖలైన పిటిషన్లపై తదుపరి విచారణను సుప్రీంకోర్టు వచ్చే నెలకు వాయిదా వేసింది.

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
శుక్రవారం 30-10-2026

'ప్రజా కవిత' పుస్తకంలో

డాక్టర్ రూపకు చోటు



ఇది కద నిజం, రాజేంద్రనగర్ :తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు ఏనుగు నరసింహారెడ్డి చేతుల మీదుగా విడుదలైన 'ప్రజా కవిత' పుస్తకంలో జడ్పీహెచ్ఎస్ శివరాంపల్లి స్కూల్ అసిస్టెంట్ డాక్టర్ రూపకి స్థానం లభించింది. నందిని సిధారెడ్డి, ఏనుగు నరసింహారెడ్డి, గోరేటి వెంకన్న వంటి దిగ్గజ కవుల సరసన డాక్టర్ రూప కవితకు చోటు దక్కడం పట్ల పాఠశాల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) రాజేంద్రనగర్ మండల అధ్యక్షులు బాలకృష్ణ మరియు తోటి ఉపాధ్యాయులు ఆమెను ప్రత్యేకంగా అభినందించారు.

'ప్లాటినం ఐకాన్--2026' అవార్డు గ్రహీత బట్టార్ సురేంద్ర ఆచార్యులకు ఈఓ అభినందనలు



ఇది కద నిజం, యాదగిరిగుట్ట: న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఉజ్వల శిఖరము ఆర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ప్రధాన అర్చకులు బట్టార్ సురేంద్ర ఆచార్యులు 'ప్లాటినం ఐకాన్--2026' అవార్డును అందుకున్న సందర్భంగా దేవస్థాన కార్యనిర్వహణాధికారి వారిని అభినందించి, సత్కరించారు. ఈ సందర్భంగా దేవస్థాన కార్యనిర్వహణాధికారి మాట్లాడుతూ, "ఆధ్యాత్మిక, ధార్మిక రంగాల్లో విశిష్ట సేవలందిస్తున్న అర్చకులను గుర్తించి గౌరవ పురస్కారాలతో సత్కరించడం అభినందనీయ పరిణామం. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన ప్రధాన అర్చకులు బట్టార్ సురేంద్ర ఆచార్యులకు 'ప్లాటినం ఐకాన్--2026' అవార్డు లభించడం వ్యక్తిగతంగా వారికి దక్కిన గౌరవమే కాకుండా, దేవస్థాన ప్రతిష్ఠను ఇనుమడింపజేసే విశేష గౌరవంగా భావిస్తున్నాం. ఈ పురస్కారం ద్వారా యాదగిరిగుట్ట పుణ్యక్షేత్రానికి మరింత గుర్తింపు లభించడం సంతోషదాయకం. స్వామివారి నిత్య కైంకర్యాలు, ఆధ్యాత్మిక సంప్రదాయాల పరిరక్షణలో అర్చకుల పాత్ర అత్యంత కీలకమైనది. బట్టార్ సురేంద్ర ఆచార్యులు భవిష్యత్తులోనూ ఇదే నిబద్ధతతో స్వామివారి సేవలో కొనసాగుతూ మరిన్ని ప్రశంసలు, పురస్కారాలు అందుకోవాలని ఆకాంక్షిస్తున్నాం" అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రధాన అర్చకులు బట్టార్ సురేంద్ర ఆచార్యులకు దేవస్థానం తరఫున అభినందనలు తెలియజేశారు.

మాజీ మంత్రి జగదీశ్ రెడ్డికి

చిట్యాల వద్ద ఘన స్వాగతం



ఇది కద నిజం:మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంతకంట్ల జగదీశ్ రెడ్డి ఆలేరు నియోజకవర్గానికి వెళ్తున్న సందర్భంగా మార్గమధ్యంలో 'న్యూ వివేరా' హోటల్ వద్ద కాసేపు ఆగారు. ఈ విషయం తెలుసుకున్న భారత్ రాష్ట్ర సమితి బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు అక్కడకు చేరుకుని ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు.

మాజీ మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన వారిలో భారత్ రాష్ట్ర సమితి బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు కుతాడి సురేష్, మండల పార్టీ అధ్యక్షులు, సర్పంచుల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జక్క రాఘవేంద్ర రెడ్డి, సర్పంచ్ జనగాం పాండు, భారత్ రాష్ట్ర సమితి బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు డాక్టర్ ర్యాకల శ్రీనివాస్, అలాగే సిరివేణికుంట సర్పంచ్ వెంకటేష్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి తో నాయకులు పలు స్థానిక, పార్టీ వ్యవహారాలపై కాసేపు ముచ్చటించారు.

సైబర్ నేరాలు మాదకద్రవ్యాల నిర్మూలనపై

పోలీస్ అవగాహన కార్యక్రమం





ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా : కామారెడ్డి పట్టణంలోని వాగ్దేవి హైస్కూల్‌లో జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర ఆదేశాల మేరకు పోలీసు కళాబృందం ఆధ్వర్యంలో విద్యార్థులకు సామాజిక అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రేమ పేరుతో మోసాలు, మైనర్ల డ్రైవింగ్, మాదకద్రవ్యాల నిర్మూలన, సైబర్ నేరాలు, బాలలపై నేరాలు, మహిళల రక్షణ, మానవ అక్రమ రవాణాపై మాటలు, పాటల ద్వారా అవగాహన కల్పించారు. సామాజిక మాధ్యమాలను జాగ్రత్తగా వినియోగించాలని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సూచనలు పాటించాలని, మూఢనమ్మకాలకు దూరంగా ఉండాలని పోలీసులు సూచించారు. సైబర్ నేరాల కోసం 1930, మాదకద్రవ్యాల సమాచారానికి 1908, షీ టీమ్ కోసం 8712686094, అత్యవసర సహాయం కోసం 112 నంబర్లను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు కళాబృందం ఇన్‌చార్జి హెడ్ కానిస్టేబుల్ రామంచ తిరుపతి, హెడ్ కానిస్టేబుల్ యు. శేషారావు, పోలీసు సిబ్బంది ప్రభాకర్, యు. సాయిలు, షీ టీమ్ సిబ్బంది డబ్ల్యూపీసీ సౌజన్య, పోలీసు సిబ్బంది భూమయ్య, భాను, ఏహెచ్‌టీయూ సిబ్బంది రాజేందర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో

గ్రాడ్యుయేట్ ఎక్స్‌ప్రెస్ బస్సుకు ప్రత్యేక పూజలు

- ఎమ్మెల్సీ అభ్యర్థి గడల శ్రీనివాసరావు విజయం కాంక్షిస్తూ అన్నదాన ట్రస్ట్‌కు రూ. 1,00,116 విరాళం
- ఆలయ ఈవో భవానీ శంకర్‌కు విరాళం అందజేసిన జనసేన నాయకులు ఆముదాల పరమేశ్

ఇది కద నిజం,యాదాద్రి భువనగిరి జిల్లా: ఉమ్మడి ఖమ్మం, వరంగల్, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో జనసేన పార్టీ అభ్యర్థి గడల శ్రీనివాసరావు ప్రచారంలో భాగంగా ఏర్పాటు చేసిన గ్రాడ్యుయేట్ ఎక్స్‌ప్రెస్ బస్సును హైదరాబాద్‌లో ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ చేతుల మీదుగా ప్రారంభించడం జరిగింది. ఈ నేపథ్యంలో గ్రాడ్యుయేట్ ఎక్స్‌ప్రెస్ బస్సు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ప్రారంభమైన సందర్భంగా యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి గడల శ్రీనివాసరావు ఈ ఎన్నికల్లో విజయం సాధించాలని, ఆయన చేపట్టిన ప్రచార కార్యక్రమాలు విజయవంతం కావాలని స్వామివారిని ప్రార్థించారు. అనంతరం గ్రాడ్యుయేట్ ఎక్స్‌ప్రెస్ బస్సుకు స్వామివారి ఆశీస్సులు లభించాలని కోరుతూ పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఉమ్మడి నల్లగొండ జిల్లా జనసేన పార్టీ నాయకులు ఆముదాల పరమేశ్ , ఎమ్మెల్సీ అభ్యర్థి గడల శ్రీనివాసరావు విజయం కోసం కాంక్షిస్తూ యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ అన్నదాన ట్రస్ట్‌కు రూ. 1,00,116 (లక్షా నూట పదహారు రూపాయలు) విరాళంగా అందజేశారు. ఈ మొత్తాన్ని ఆలయ ఈవో భవానీ శంకర్ కి అందించారు.

ఈ సందర్భంగా ఆముదాల పరమేశ్ మాట్లాడుతూ, "యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామివారి ఆశీస్సులు ఉంటే ఎలాంటి లక్ష్యాన్నైనా సాధించగలమనే ప్రగాఢ విశ్వాసం మాకుంది. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి గడల శ్రీనివాసరావు ఈ ఎన్నికల్లో విజయం సాధించాలని, పట్టభద్రుల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజాసేవ చేసే అవకాశం ఆయనకు లభించాలని స్వామివారిని మనస్ఫూర్తిగా ప్రార్థించాం. స్వామివారి దివ్య ఆశీస్సులతో ఈ ఎన్నికల్లో విజయం



సాధిస్తామనే నమ్మకం మాకుంది. ధర్మం, ప్రజాసేవ, పట్టభద్రుల సంక్షేమం లక్ష్యంగా మా ప్రయాణం కొనసాగుతుంది" అని పేర్కొన్నారు. గ్రాడ్యుయేట్ ఎక్స్‌ప్రెస్ ద్వారా పట్టభద్రులకు చేరువ కావడం, వారి సమస్యలను తెలుసుకోవడం, వాటిపై అవగాహన కల్పించడం, ఎన్నికల ప్రక్రియలో పట్టభద్రుల భాగస్వామ్యాన్ని పెంపొందించడం లక్ష్యంగా కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా జనసేన పార్టీ నాయకులు ఆముదాల పరమేశ్,పీక ప్రవీణ్, మామిడాల రమేశ్, ఉట్కూరి సంతోష్,కలకోట ప్రశాంత్ ,పాశం శ్రీకాంత్,జహంగీర్, బెల్లంకొండా నరేశ్, వర్కాల నిఖిల్, అరె రాజేశ్, పవన్ కుమార్, రాజబోయిన రాజు , ప్రశాంత్ జనసైనికులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

- యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి

ఇది కద నిజం,: యాదాద్రి భువనగిరి జిల్లా,ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే పేషెంట్లకు వైద్యాధికారులు,సిబ్బంది అందుబాటులో లో ఉండి మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. గురువారం వలిగొండ మండలం వెలువర్తి గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సందర్శించి, అక్కడ అందిస్తున్న వైద్య సేవలను, రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న సిబ్బంది వివరాలను, వారి హాజరు రిజిస్టర్లను తనిఖీ చేశారు. సిబ్బంది ప్రతిరోజూ విధులకు హాజరవుతున్నారా, రోజువారీ హాజరును ప్రమాణ్ యాప్‌లో నమోదు చేస్తున్నారా అనే విషయాలను వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రానికి ప్రతిరోజూ ఎంతమంది రోగులు వస్తున్నారని, వారికి సంబంధించిన వివరాలను ఏ విధంగా నమోదు చేస్తున్నారని , రోగుల వివరాలను అభా యాప్‌లో కూడా నమోదు చేస్తున్నారా అని ఆరా తీశారు. రోగులకు అవసరమైన వైద్య





సేవలను సకాలంలో అందించాలని సూచించారు. అనంతరం ల్యాబ్‌ను పరిశీలించి, అక్కడ నిర్వహిస్తున్న వైద్య పరీక్షలు, సేకరించిన నమూనాలను తదుపరి పరీక్షల కోసం ఎక్కడికి పంపిస్తున్నారు అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. గర్భిణులకు సంబంధించిన ఏఎన్‌సీ రిపోర్టులను పరిశీలించి, వారికి క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారా, ప్రసవాల కోసం ఏయే ఆసుపత్రులకు వెళ్తున్నారనే వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పుట్టిన శిశువులకు షెడ్యూల్ ప్రకారం టీకాలు వేస్తున్నారా అని ఆరా తీశారు. అలాగే, 14 సంవత్సరాల బాలికలకు హెచ్‌పీవీ టీకాలు వేస్తున్నారా అని అమలు తీరును పరిశీలించి, అర్హులైన బాలికలకు టీకాలు అందుతున్నాయా అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్ర పరిధిలో డెంగ్యూ జ్వర కేసులు ఏమి అయినా నమోదయ్యాయా అని ఆరా తీశారు, కేసులు ఉంటే బాధితులకు ఎలాంటి వైద్య చికిత్స అందిస్తున్నారని వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వ్యాధుల లక్షణాలతో వచ్చే వారికి సకాలంలో పరీక్షలు నిర్వహించి తగిన చికిత్స అందించాలని సూచించారు. ఈ కార్యక్రమం లో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట దేవస్థానంలో రెండు అభివృద్ధి పనులకు భూమిపూజ

- దేవస్థాన చైర్మన్ ఎం. సత్యనారాయణ రెడ్డి స్వంత నిధులతో నిర్మాణ పనులు

ఇది కద నిజం : తెలంగాణ రాష్ట్ర ఆధ్యాత్మిక రాజధానిగా వెలుగొందుతున్న శ్రీ యాదగిరి లక్ష్మీ నరసింహ స్వామివారి దివ్యక్షేత్రమైన యాదగిరిగుట్టలో రెండు అభివృద్ధి పనులకు శుక్రవారం, 30-10-2026న భూమిపూజ నిర్వహించనున్నారు. యాదగిరిగుట్ట దేవస్థాన చైర్మన్ ఎం. సత్యనారాయణ రెడ్డి తన స్వంత నిధులతో చేపట్టనున్న ఈ పనుల్లో భాగంగా, ఆలయ ఉత్తర భాగంలో శ్రీ స్వామివారి నిత్య కళ్యాణ మండపం (రంగ మండపం) నిర్మాణానికి ఉదయం 11:14 గంటలకు, రాయగిరి గ్రామం వద్ద స్వాగత తోరణం (ఆర్చ్ గేట్) నిర్మాణానికి మధ్యాహ్నం 12:25 గంటలకు దైవజ్ఞులు నిర్ణయించిన సుముహూర్తాల్లో భూమిపూజ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాలకు సంబంధించిన ఏర్పాట్లను దేవస్థాన కార్యనిర్వహణాధికారి జె. భవాని శంకర్ పరిశీలించారు. కార్యక్రమాల నిర్వహణ, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తీసుకోవాల్సిన చర్యలు, వివిధ శాఖల మధ్య సమన్వయం తదితర అంశాలపై శాఖాధిపతులు మరియు అర్చక సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమాల నిర్వహణకు సంబంధించి పలు సూచనలు జారీ చేశారు. భూమిపూజ కార్యక్రమాలు సజావుగా జరిగేలా, భక్తులకు దర్శన సంబంధిత ఇబ్బందులు తలెత్తకుండా, ఆలయ కార్యకలాపాలకు ఎలాంటి అంతరాయం కలగకుండా అవసరమైన ఏర్పాట్లు సమర్థవంతంగా చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. దేవస్థాన అభివృద్ధికి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు ఈ నిర్మాణ పనులు దోహదపడనున్నాయి.



ప్రజాస్వామ్య పరిరక్షణకు రామ్‌లీలా మార్చ్‌ను విజయవంతం చేయాలి

- పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి : కాంగ్రెస్ అధికార ప్రతినిధి నల్లాల వినయ్ కుమార్

ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పిట్లం, అక్టోబర్ 29: ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓట్ల చోరీని అడ్డుకోవడం, రాజ్యాంగాన్ని కాపాడటమే లక్ష్యంగా ఢిల్లీలో నిర్వహించనున్న రామ్‌లీలా మార్చ్‌ను విజయవంతం చేయాలని జుక్కల్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి నల్లాల వినయ్ కుమార్ పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడుకోవడం, ప్రతి పౌరుడి ఓటు హక్కుకు రక్షణ కల్పించడం, రాజ్యాంగ స్ఫూర్తిని నిలబెట్టడం నేటి సమాజంలో ఎంతో ముఖ్యమని ఆయన పేర్కొన్నారు. రామ్‌లీలా మార్చ్ ఏ ఒక్క రాజకీయ పార్టీకి పరిమితమైన కార్యక్రమం కాదని, దేశ ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ పరిరక్షణ కోసం చేపడుతున్న ఉద్యమమని వినయ్ కుమార్ స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి ఓటుకు తగిన గుర్తింపు, గౌరవం ఉండాలని అన్నారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం నిలబెట్టేందుకు, ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని కోరారు. దేశ రాజ్యాంగం ప్రజలందరికీ సమాన హక్కులు కల్పించిందని, ఆ హక్కులను కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని ఆయన తెలిపారు. ప్రజాస్వామ్యంపై విశ్వాసం ఉన్నవారు రాజకీయ విభేదాలను పక్కనపెట్టి రామ్‌లీలా మార్చ్‌లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. దేశ భవిష్యత్తు, ప్రజాస్వామ్య పరిరక్షణ దృష్ట్యా ప్రజలంతా ఐక్యంగా తమ గొంతు వినిపించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నల్లాల వినయ్ కుమార్ కోరారు.



Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
శుక్రవారం 30-10-2026

యాదగిరిగుట్ట శ్రీవారి నిత్యాన్నదానానికి ఆముదాల పరమేష్, గోవర్ధన్ రెడ్డి విరాళం

ఇది కద నిజం,యాదగిరిగుట్ట : శ్రీ యాదగిరి లక్ష్మీ నరసింహ స్వామివారి దేవస్థానంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి ఇద్దరు దాతలు కలిపి రూ. 2,01,116 విరాళాన్ని సమర్పించారు. చౌటుప్పల్ మండలం లక్కారం గ్రామానికి చెందిన ఆముదాల పరమేష్ రూ. 1,00,116 విరాళాన్ని చెక్కు రూపంలో దేవస్థాన కార్యనిర్వహణాధికారికి అందజేశారు. అదేవిధంగా, ఎల్బీనగర్‌కు చెందిన గోవర్ధన్ రెడ్డి రూ. 1,01,000 విరాళాన్ని చెక్కు రూపంలో కార్యనిర్వహణాధికారికి సమర్పించారు. స్వామివారి నిత్యాన్నదాన పథకానికి భక్తులు అందిస్తున్న విరాళాలు ఎంతో మంది భక్తులకు అన్నప్రసాదం అందించేందుకు దోహదపడుతున్నాయి. ఈ సందర్భంగా దాతల సేవాభావాన్ని దేవస్థాన కార్యనిర్వహణ అధికారి అభినందించి ఉన్నారు. శ్రీ స్వామివారి కృపాకటాక్షాలు దాతలపై, వారి కుటుంబ సభ్యులపై సదా ఉండాలని ఆకాంక్షించారు

ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో దిశానిర్దేశం చేసిన మాజీ మంత్రి జగదీష్ రెడ్డి



ఇది కద నిజం: రానున్న ఖమ్మం – వరంగల్ – నల్లగొండ ఉమ్మడి జిల్లాల ఎన్నికలలో బాగంగా యాదగిరిగుట్ట మండలం, వంగపల్లి గ్రామంలోని ఫాంహౌస్ ఫంక్షన్ హాల్ లో మాజీ ప్రభుత్వ విప్, ఆలేరు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇంచార్జ్ గొంగిడి సునిత మహేందర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరై ఓటు నమోదు ప్రక్రియ విజయవతంగా చేసేందుకు తీసుకోవాల్సిన చర్యల పై నాయకులకు దిశ నిర్దేశం చేసిన మాజీ మంత్రివర్యులు, సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎన్నికల ఇంచార్జ్ బండ నరేందర్ రెడ్డి , యాదాద్రి భువనగిరి బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు కంచర్ల రామకృష్ణ రెడ్డి , మాజీ ఎమ్మెల్యే బూడిద బిక్షమయ్య గౌడ్ , బీఆర్ఎస్ నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి , కల్లూరి రామచంద్ర రెడ్డి, నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు, ఎమ్మెల్సీ ఎన్నికల ఇంచార్జిలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కంబాలపల్లి ఎంపీటీసీగా తిక్కమ్మనేని మంజుల ఏకగ్రీవం



నెల్లూరు జిల్లా రాపూరు(ఇది కద నిజం):-నెల్లూరు జిల్లా రాపూరు మండల పరిధిలోని కంబాలపల్లి ఎంపీటీసీ స్థానానికి తెలుగుదేశం పార్టీ అభ్యర్థి తిక్కమ్మనేని మంజుల ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణల ప్రక్రియ ముగిసిన అనంతరం ఆమె ఎన్నిక ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారులు అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో రిటర్నింగ్ అధికారి వెంకటేశ్వర్లు చేతుల మీదుగా ఆమె ఎన్నిక ధ్రువీకరణ పత్రాలను అందుకున్నారు. నూతనంగా ఎన్నికైన తిక్కమ్మనేని మంజులకు శాలువాలు కప్పి, పూలమాలలు వేసి మిఠాయిలు పంచి ఘనంగా శుభాకాంక్షలు తెలిపారు. కంబాలపల్లి పరిధిలోని గ్రామాల సమగ్ర అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని ఈ సందర్భంగా మంజుల స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మిత్రుడి కుమారుడి వివాహానికి పెద్దగా నిలిచిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



ఇది కద నిజం న్యూస్ హన్మకొండ/ అక్టోబర్ 29

హనుమకొండ: వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు – మల్లేశ్వరి దంపతులు తన మిత్రుడి కుటుంబంతో ఉన్న ఆత్మీయ అనుబంధాన్ని చాటుకున్నారు. తన స్నేహితుడు కే.శే.కాలేశ్వరం ప్రకాశం–సుజాత దంపతుల ప్రథమ పుత్రుడు సూర్యదేవ్ వివాహం హిమాన్షితో హనుమకొండలోని కోడెం కన్వెన్షన్ హాల్ లో ఘనంగా జరిగింది. ఈ వేడుకకు ఎమ్మెల్యే దంపతులు హాజరయ్యారు.కేవలం అతిథిగా కాకుండా మిత్రుడి కుటుంబానికి అండగా నిలుస్తూ పెళ్లి పెద్దగా వ్యవహరించి, వివాహాన్ని స్వయంగా ముందుండి నిర్వహించారు.పెళ్లి పీటలపై కూర్చొని సంప్రదాయబద్ధంగా వధూవరుల వివాహ వేడుకను జరిపించారు.తన మిత్రుడి కుమారుడి వివాహాన్ని తన ఇంటి శుభకార్యంగా భావించి అన్ని బాధ్యతలు తానే తీసుకొని దగ్గరుండి జరిపించడం బంధుమిత్రులను ఆకట్టుకుంది. వధూవరులను ఆశీర్వదించి వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో నిండాలని ఆకాంక్షించారు.మిత్రుడి సంతోషాన్ని తన సంతోషంగా భావించి కుటుంబ సభ్యుడిగా పెళ్లి పెద్ద బాధ్యతలు స్వీకరించిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆత్మీయత ఈ వేడుకలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

అత్తాపూర్ డివిజన్‌లో ఎమ్మెల్సీ ఓటు నమోదు,
అమిత్ షా ర్యాలీపై బీజేపీ కార్యాచరణ సమావేశం



ఇది కద నిజం అక్టోబర్, 29: అత్తాపూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు సులిగే వెంకటేష్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఓటు నమోదు ప్రక్రియ మరియు ట్యాంక్‌బండ్ ర్యాలీ నిర్వహణపై ముఖ్య కార్యాచరణ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే, అత్తాపూర్ డివిజన్ ప్రభారి అందె బాబన్న హాజరై నాయకులు, కార్యకర్తలకు పలు విషయాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో అందె బాబన్న మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఓటు నమోదు ప్రక్రియను నవంబర్ 6వ తేదీలోపు సమర్థవంతంగా పూర్తి చేయాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ తప్పకుండా ఓటు నమోదు చేసుకునేలా విస్తృత అవగాహన కల్పించాలని, నాయకులు మరియు కార్యకర్తలు క్షేత్రస్థాయిలో కష్టపడి అర్హులైన ఓటర్లందరిచేత నమోదు చేయించాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా, బీజేపీ మహా పాదయాత్రలో భాగంగా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పాల్గొననున్న ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. నవంబర్ 2వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు ట్యాంక్‌బండ్‌పై స్వామి వివేకానంద విగ్రహం నుంచి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వరకు ఈ భారీ ర్యాలీ సాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చేలా జన సమీకరణ చేయాలని, ఏర్పాట్లను పక్కాగా పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు పి. వెంకట్ రెడ్డి, జి. రాజు, జి. అమర్నాథ్ రెడ్డి, శశికాంత్ శర్మ, జిత్తు భాయ్, విజయ్ స్వామి, గురుప్రీత్ సింగ్, లక్ష్మీకాంత్ రెడ్డి, నరేష్ కుమార్, అంకుష్, బాలకృష్ణ, ఎం. సరిత రెడ్డి, కె. విజయలక్ష్మి, ఉమా బాయ్, రామారావు, విమల్ శర్మ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేవైఎం వికారాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడిగా దగ్గుల శ్రీహరి గౌడ్ నియామకం



ఇది కద నిజం, వికారాబాద్ : వికారాబాద్ జిల్లా బీజేవైఎం ఉపాధ్యక్షుడిగా నియమితులైన దగ్గుల శ్రీహరి గౌడ్ విద్యార్థి దశ నుంచే ప్రజా, విద్యార్థి సమస్యలపై నిరంతరం పోరాడుతూ తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ మండల అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తిస్తూ విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం, వారి సమస్యల పరిష్కారం కోసం పలు ఉద్యమాల్లో కీలక పాత్ర పోషించారు. తన సిద్ధాంతాలకు అనుగుణంగా భారతీయ జనతా పార్టీలో చేరిన శ్రీహరి గౌడ్, భారతీయ జనతా యువమోర్చా లో మండల ప్రధాన కార్యదర్శిగా, ఆ తర్వాత మండల అధ్యక్షుడిగా వివిధ హోదాల్లో పార్టీ బలోపేతానికి విశేష సేవలు అందించారు. పార్టీ పిలుపునిచ్చిన ప్రతి కార్యక్రమంలోనూ చురుగ్గా పాల్గొంటూ, యువత ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం తన గళాన్ని వినిపిస్తూ ముందుకు సాగారు. ఈ క్రమంలో ఆయన సేవలను గుర్తించిన పార్టీ అధిష్ఠానం తాజాగా ఆయనను బీజేవైఎం వికారాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించి కీలక బాధ్యతలను అప్పగించింది. విద్యార్థి ఉద్యమాలతో మొదలైన ఆయన ప్రస్థానం నేడు జిల్లా స్థాయి నాయకుడిగా ఎదగడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా శ్రీహరి గౌడ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ బాధ్యతలను అప్పగించిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజుల్లో యువత ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి పోరాడుతూ, వారిలో నాయకత్వ లక్షణాలను పెంపొందించడానికి మరియు పార్టీ సంస్థాగత బలోపేతం కోసం శాయశక్తులా కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

వెంకట సాయి నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు విజయేందర్ రెడ్డి దంపతుల
తొలి వివాహ వార్షికోత్సవ వేడుకలు



ఇది కద నిజం,హైదరాబాద్, రామంతాపూర్: వెంకట సాయి నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ. విజయేందర్ రెడ్డి, కావ్య రెడ్డి దంపతుల తొలి వివాహ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ గౌరవ సభ్యులు, టీమ్ సభ్యులు, అసోసియేషన్ కమిటీ సభ్యులు పాల్గొని నూతన దంపతులకు వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో వారి వైవాహిక జీవితం కొనసాగాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కాలనీ గౌరవ సభ్యులు రమేష్ గౌడ్, ఎం. రవికుమార్, సంజీవ్‌తో పాటు కమిటీ సభ్యులు ఆర్. గోవింద్, జి. అశోక్, శ్రీనివాస్ గౌడ్, కె. నవీన్ కుమార్, భూపతి నరసింహ గౌడ్, డాక్టర్ విద్యాసాగర్, రమేష్ శెట్టి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయేందర్ రెడ్డి దంపతులకు పలువురు శుభాకాంక్షలు తెలియజేసి, వారి కుటుంబ జీవితం సంతోషంగా, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

టీడీపీ మీద నేదురుమల్లి ఘాటు విమర్శలు



ఉమ్మడి నెల్లూరు జిల్లా వెంకటగిరి(ఇది కద నిజం):-రాష్ట్రంలో ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించే దమ్ము, ధైర్యం టీడీపీ కూటమి ప్రభుత్వానికి లేవని వైఎస్సార్‌సీపీ నేత నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులను నామినేషన్ల విషయంలో ఇబ్బందులకు గురిచేయడం, నామినేషన్ పత్రాలను చించివేయడం, భౌతిక దాడులకు పాల్పడటం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆయన ఆరోపించారు.వెంకటగిరి మున్సిపాలిటీ పరిధిలోని పెద్ద శివాలయం వీధి వద్ద మున్సిపల్ చైర్‌పర్సన్ బొలిగల దీవెనతో కలిసి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రచార కార్యక్రమాన్ని ముమ్మరంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. నాయకులకు పూలవర్షంతో స్వాగతం పలుకుతూ తమ అభిమానాన్ని వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ, “కూటమి ప్రభుత్వానికి ఎన్నికలు నిర్వహించే దమ్ము, ధైర్యం ఉంటే ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించి ప్రజాతీర్పును స్వీకరించాలి. వైఎస్సార్‌సీపీ నేతలను నామినేషన్ల పేరుతో ఇబ్బందులకు గురిచేయడం, దాడులకు పాల్పడటం మీ సంస్కృతా? ప్రజాస్వామ్యం అంటే ఇదేనా?” అని ప్రశ్నించారు.

టీడీపీ నేతలకు దమ్ము, ధైర్యం ఉంటే రాజకీయంగా ప్రజాక్షేత్రంలో పోరాడాలని, ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించి ప్రజల నిర్ణయాన్ని గౌరవించాలని ఆయన సూచించారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే అంతిమ నిర్ణేతలని, వారి తీర్పును స్వీకరించాల్సిన బాధ్యత ప్రతి రాజకీయ పార్టీపై ఉందని పేర్కొన్నారు.

“ టీడీపీ నేతలారా.. వైఎస్సార్‌సీపీ నాయకులను అడ్డుకోవడం, ఇబ్బందులకు గురిచేయడం మానుకోవాలి. రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలను ప్రజలు గమనిస్తున్నారు. తగిన సమయంలో ప్రజలే సమాధానం చెబుతారు” అని నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి హెచ్చరించారు.

ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ, అభ్యర్థులకు స్వేచ్ఛగా ఓటును వినియోగించుకునే అవకాశం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఉచిత ఆరోగ్య శిబిరం విజయవంతం



ఇది కద నిజం న్యూస్ కడపజిల్లా అక్టోబర్ 29: కడపజిల్లా... ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను చేరువ చేస్తూ, మహిళల ఆరోగ్యం, ప్రసూతి వైద్యం, జనరల్ మెడిసిన్, మధుమేహ నియంత్రణ వంటి విభాగాల్లో ప్రత్యేక సేవలందిస్తూ రెయిన్ షైన్ హాస్పిటల్ కడప నగరంలో తనదైన గుర్తింపును చాటుకుంటోంది. అనుభవజ్ఞులైన వైద్యుల పర్యవేక్షణలో సమగ్ర వైద్య సేవలు అందిస్తూ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యమిస్తోంది. ఈ క్రమంలో గురువారం ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య పరీక్షల శిబిరం విజయవంతంగా ముగిసింది. ఈ శిబిరంలో కడప నగరంతో పాటు జిల్లాలోని పలువురు రోగులు పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకొని, తమ ఆరోగ్య పరిస్థితికి సంబంధించిన వివరాలు తెలుసుకోవడంతో పాటు వైద్యుల నుంచి తగిన సలహాలు పొందారు. శిబిరంలో ఫ్రైబ్రోస్కాన్, సీరం హోమోసిస్టీన్, థైరాయిడ్ ఫంక్షన్ పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. ఒక్కో వ్యక్తికి సుమారు రూ.7,000 కంటే ఎక్కువ విలువైన వైద్య పరీక్షలు, సంబంధిత వైద్య సేవలను ఉచితంగా అందించడం ఈ శిబిరం ప్రత్యేకతగా నిలిచింది. ఖరీదైన వైద్య పరీక్షలను ఎటువంటి ఖర్చు లేకుండా పొందడం పట్ల రోగులు హర్షం వ్యక్తం చేస్తూ ఆసుపత్రి యాజమాన్యానికి, వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

ముఖ్యంగా డాక్టర్ ఎన్. శివకృష్ణ ప్రతి రోగికి ప్రత్యేక శ్రద్ధతో అందుబాటులో ఉంటూ స్వయంగా దగ్గరుండి వైద్య పరీక్షలను పర్యవేక్షించారు. పరీక్షలు సక్రమంగా జరిగేలా చూసుకోవడంతో పాటు రోగుల ఆరోగ్య సమస్యలను పరిశీలించి అవసరమైన వైద్య సూచనలు అందించారు.

కడప నగరంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో, బ్యాంక్ ఆఫ్ బరోడా ఎదురుగా, సంధ్య సర్కిల్ సమీపంలో ఉన్న రెయిన్ షైన్ హాస్పిటల్‌లో డాక్టర్ టి. అపర్ణ ఎంబీబీఎస్, డిఎన్బి ఓబిజీ గర్భిణీ స్త్రీలు, ప్రసూతి మరియు స్త్రీల ఆరోగ్య సమస్యల నిపుణురాలిగా సేవలందిస్తున్నారు. గతంలో కడప రిమ్స్‌లో సీనియర్ రెసిడెంట్‌గా, బెంగళూరులోని మదర్‌హుడ్ హాస్పిటల్‌లో కన్సల్టెంట్‌గా పనిచేసిన అనుభవం ఆమెకు ఉంది. గర్భిణీ స్త్రీల ఆరోగ్య సంరక్షణ, సాధారణ కాన్పులు, సిజేరియన్ ఆపరేషన్లు, అధిక ప్రమాద గర్భధారణ నిర్వహణ, సంతానలేమి సమస్యలు, పీసీఓఎస్, రుతుక్రమ సమస్యలు, మెనోపాజ్ సంబంధిత సమస్యలు, గర్భాశయ ఫైబ్రాయిడ్లు, అండాశయాల్లో నీటి బుడగలు, గర్భాశయ వ్యాధులు, గర్భాశయ క్యాన్సర్ స్క్రీనింగ్ వంటి విభాగాల్లో వైద్య సేవలు అందిస్తున్నారు.

అదేవిధంగా డాక్టర్ ఎన్. శివకృష్ణ ఎంబిబిఎస్, ఎండి జనరల్ మెడిసిన్, జనరల్ ఫిజీషియన్, డయాబెటాలజిస్ట్‌గా సేవలందిస్తున్నారు. గతంలో క్రిస్టియన్ మెడికల్ కాలేజ్ సిఎంసి, వెల్లూరులో కన్సల్టెంట్‌గా పనిచేసిన అనుభవం ఆయనకు ఉంది. మధుమేహం, అధిక రక్తపోటు, థైరాయిడ్ సమస్యలు, గుండె సంబంధిత ఆరోగ్య సమస్యలు, జీర్ణకోశ వ్యాధులు, కామెర్లు, ఆస్తమా, క్షయవ్యాధి, వివిధ రకాల జ్వరాలు, తలనొప్పి, పక్షవాతం తదితర సమస్యలకు వైద్య సేవలు అందిస్తున్నారు.